# పత్రికా ప్రకటన

హైదరాబాద్ : 26.03.2007

---

## విజ్ఞుల సభకు ఎన్నికల తీరు ఇలాగేనా? : జయప్రకాశ్ నారాయణ్

పెద్దల సభగా మన్నన పొందాల్సిన శాసనమండలికి ఎన్నికలు జరిగిన తీరు ప్రజాస్వామ్యవాదులంతా తలదించుకునేలా వుందని 'లోక్‌సత్తా పార్టీ' జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టభద్రుల్ని కూడా ఖరీదైన బహుమతులు, డబ్బుతో ప్రలోభపెట్టటం, బహిరంగ ఓటింగ్‌కి పాల్పడటం వంటి చర్యలు ఎన్నికల వ్యవస్థలోని భయంకర జాడ్యాలను బట్టబయలు చేస్తున్నాయన్నారు. ఇలాంటి మార్గాల ద్వారా ఎన్నికైన సభ్యులు రేపు శాసనమండలిలో ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో చర్చించగలరా అని ఆయన ప్రశ్నించారు. అయితే ఇలాంటి కలుషిత రాజకీయ వాతావరణంలో సైతం ప్రజలు కొందరు నిజాయితీపరులను గెలిపించి తమ విజ్ఞతను చాటుకున్నారని జేపీ హర్షం వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన పార్టీ రాష్ట్రస్థాయి సమావేశాలలో జయప్రకాశ్ నారాయణ్ ముగింపు ప్రసంగం చేశారు.

ఈ సమావేశంలో పార్టీ అన్ని జిల్లాల సమన్వయకర్తలు, కార్యదర్శులు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. బండారు రామ్మోహనరావు ప్రవేశపెట్టిన కార్యకలాపాల సమీక్షా నివేదికపై, రాష్ట్ర కార్యదర్శి డివివిఎస్ వర్మ ప్రవేశపెట్టిన భవిష్యత్ కార్యక్రమాలపై, భండారి అంకయ్య ప్రవేశపెట్టిన గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ప్రణాళిక నివేదికపై సభ్యులు చర్చించారు.

అనంతరం జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ ప్రలోభాలు, హింస, అక్రమాలకు తావులేని రీతిలో లోక్‌సత్తా పార్టీ రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో పోటీ చేస్తుందని పేర్కొన్నారు. నూటికి నూరుపాళ్ళు ప్రజాస్వామిక పద్ధతుల్లో వ్యవహరించటం ద్వారా లోక్‌సత్తా పార్టీ మిగిలిన రాజకీయ పక్షాలన్నిటికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచీ పార్టీలో జరిగే ప్రతి ఎన్నిక పారదర్శకంగా, ప్రజాస్వామిక పద్ధతుల్లో జరుగుతుందన్నారు. ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో కూడా స్థానిక కమిటీలే ప్రధానపాత్ర పోషిస్తాయని జేపీ పేర్కొన్నారు.

ఎన్నికల వ్యవస్థలో తీసుకురావల్సిన సమూల మార్పులకు లోక్‌సత్తా పార్టీ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని జేపీ తెలిపారు. ఇది అంత సులువైన పని కాకపోయినా, ఎంత శ్రమకోర్చయినా లోక్‌సత్తా ఈ మార్పు కోసం కృషి చేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. లోక్‌సత్తా పార్టీ భావాలను, ఆశయాలను ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకువెళ్ళేందుకు బృహత్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాల ద్వారా కార్యకర్తలు సామాన్య ప్రజానీకంతో మమేకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక రాజకీయపార్టీ ఎలా వుండాలని ప్రజలంతా కోరుకుంటారో అటువంటి పార్టీని నిర్మించేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని జేపీ కోరారు. లోక్‌సత్తా పార్టీలో సభ్యులుగా మారి సమాజంలో ఒక నూతన రాజకీయ సంస్కృతిని నిర్మించేందుకు ప్రజలు కూడా పెద్దసంఖ్యలో ముందుకు వస్తున్నారని, ఈ అవకాశాన్ని పార్టీ పూర్తిస్థాయిలో వినియోగించుకోవాల్సివుందని జయప్రకాశ్ నారాయణ్ అన్నారు.

:: లోక్‌సత్తా పార్టీ